క్లుప్తంగా

పాఠశాలకు వాటర్ ఫ్రిజ్ అందజేత



వాటర్ ఫ్రిజ్ అందజేస్తున్న దాత

పామూరు: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థుల కోసం దాతలు వాటర్ ఫ్రిజ్ అందజేయడం సంతోషమని పాఠశాల హెచ్ఎం జీవీ పద్మావతి అన్నారు. మండల కేంద్రం పామూరు అంకాళమ్మ వీధి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు పామూరుకు చెందిన ఎంపీటీసీ సభ్యుడు ఆకుపాటి వెంకటేష్ తన సొంత నిధులతో వాటర్ ఫ్రిజ్ కొనుగోలు చేసి శనివారం పాఠశాలలో హెచ్ఎం జీవీ పద్మావతికి అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ రానున్న వేసవిలో విద్యార్థులకు చల్లని నీరు అందించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని దాతను అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ లావణ్య, జైపాల్‌రెడ్డి, ఎస్.నాయబ్‌రసూల్, రామాంజనేయులు, పలువురు పాల్గొన్నారు.

రెండు బైకుల ఢీ



రోడ్డు మీద పడి ఉన్న పవన్

టంగుటూరు: ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి వేగంగా మరో బైక్ ఢీకొట్టడంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. టంగుటూరుకు చెందిన పవన్ ఓ ప్రైవేటు రవాణా సంస్థను నడుపుతున్నాడు. శుక్రవారం రాత్రి టంగుటూరు నుంచి బైకుపై పని నిమిత్తం సింగరాయకొండకు బయలుదేరాడు. ఈక్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వ్యక్తులు అతివేగంతో బైక్‌తో ఢీకొట్టింది. దీంట పవన్ బైక్‌పై నుంచి కిందపడటంతో గాయాలయ్యాయి. వేగంగా ఢీకొట్టిన యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. స్థానిక యువకులను వెంబడించినా ఫలితం లేదు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



ఉదయం టంగుటూరులో 09:30 గంటల సమయంలో కురుస్తున్న మంచు



జాతీయ రహదారిలో ఉదయం 9 గంటలకు మంచు కారణంగా లైట్లు వేసుకొని వస్తున్న వాహనం

మంచు కురిసె.. మనసు మురిసె

టంగుటూరు: పొగమంచు .. మనసును తాకే చల్లని సూరీడు కిరణాలు. అలా చూస్తేచాలు ఎంతో ఆనందంగా ఉంటుంది కదా. శనివారం టంగుటూరు మండలంలో దట్టమైన మంచు కమ్మేసింది. చిరుజల్లుల్లా కురుస్తున్న మంచు ప్రజల మదిని పులకరించింది. దట్టమైన మంచుతో ఉదయం 09:30 గంటలు దాటినా సూర్యుడు ముఖం చాటేశాడు. దీంతో జాతీయ రహదారి, పలు రోడ్లపై వాహనదారులు లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు.

యోగాతో శారీరక సామర్థ్యం



యోగా చేస్తున్న సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్ కుమార్

కొండపి: యోగ శారీరక సామర్థ్యాన్ని పెంచుతుందని సీఐ సోమశేఖర్ అన్నారు. జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ రావు ఆదేశాల మేరకు, సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి యోగా కార్యక్రమాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్య రక్షణకు, ఒత్తిడి నివారణకు యోగ చాలా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని, కచ్చితంగా రోజూ వ్యాయామం చేయాలని సూచించారు. సిబ్బందికి ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే తెలియజేయాలని, వారి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. అనంతరం సిబ్బందికి క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. సిబ్బంది ఉత్సాహంగా మ్యాచ్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కొండపి ఎస్సై ప్రేమ్ కుమార్, పొన్నలూరు ఎస్సై అనూక్, ఎ ఎస్సై అంకారావు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిమితికి మించి ఎక్కిస్తే జరిమానా



కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ హజరత్తయ్య, ఎస్సై నాగమల్లీశ్వరరావు

టంగుటూరు: ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ఎక్కువగా జనాలను ఎక్కించుకుంటే జరిమానా విధిస్తామని సింగరాయకొండ సీఐ హజరత్తయ్య హెచ్చరించారు. స్థానిక టోల్ ప్లాజా వద్ద ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు శనివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ఓవర్ లోడ్‌తో అధిక మంది ప్రయాణికులను ఎక్కించుకొని ప్రయాణిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆటో డ్రైవర్లు విధిగా లైసెన్సులు, బీమా కలిగి ఉండాలన్నారు. అనంతరం తనిఖీలు నిర్వహించి 70 వాహనాలకు జరిమానా విధించారు. ఆయన వెంట టంగుటూరు ఎస్సై నాగమల్లీశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

నత్త నడకగా సాగుతున్న పనులు



మధ్యలో ఆగిపోయిన రోడ్డు విస్తరణ పనులు

కొండపి: అధికారుల పనులు ఇలాగే ఉంటాయని మరోసారి నిరూపించారు. మండల కేంద్రంలోని స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలో నుంచి పోలీస్ స్టేషన్ వరకు రూ.25 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. విస్తరణ పనుల్లో భాగంగా 15 రోజుల క్రితం గుంతలు తీసి చదును చేశారు. అనంతరం 10 రోజుల నుంచి ఇప్పటివరకు ఒక్క పని కూడా ప్రారంభించక పోవడంతో బ్యాంకు లోపలికి వెళ్లే ప్రజలు, ఆ ప్రాంతాల్లో ఉండే ప్రజలు మెయిన్ రోడ్‌కు రావడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రారంభించిన పనుల్లో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అని అర్థం కాక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్టేట్ బ్యాంకు లోనికి వెళ్లాలంటే తీసిన గుంతలో నుంచి అటువైపు వెళ్లాల్సి వస్తుండగా వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. సైడు కాలువలు నిర్మించకుండా, రోడ్డు విస్తరణ పనులు ఎలా చేస్తారని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు విస్తరణ పనులు తొందరగా ప్రారంభించి, సైడ్ కాల్వల నిర్మాణాలు కూడా చేపట్టి, పూర్తి చేయాలని కోరుకుంటున్నారు.

పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులకు సాయం



విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్న దాత హరీష్, ఉపాధ్యాయులు

పామూరు: మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈనెల 11వ తేదీన జరగనున్న జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలకు ఎంపికైన పామూరు జీహెచ్ఎస్ విద్యార్థులకు దాతలు ఆర్థిక సాయం అందజేశారు. ఈసందర్భంగా శనివారం పాఠశాలలో హెచ్ఎం యం.రామస్వామి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జాతీయ జంప్‌రోప్ పోటీలకు ఎంపికైన 8వ తరగతి విద్యార్థిని షేక్.మన్నాద్‌తో పాటు మరోవిద్యార్థిని ఇరువురు నాసిక్ వెళ్లాల్సి ఉంది. ఈసందర్భంగా వారికి ఆర్థిక సాయంగా ఆర్యవైశ్య సంఘం నాయకులు, స్టాంప్ వెండర్ పందిటి హరీష్ ఒక్కో విద్యార్థినికి రూ.14 వేల వంతున ఆర్థిక సాయం నగదును పాఠశాల హెచ్ఎం రామస్వామి, పీడీ షేక్.మస్తాని చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. అదేవిధంగా వచ్చే 10వ తరగతి వార్షిక పరీక్షల్లో పాఠశాలలో 550 మార్కులు పైబడిన ప్రతి విద్యార్థికి రూ.5516 ఆర్థిక సాయం అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు, జీజేసీ అధ్యాపకుడు గుత్తి రమణయ్య, సోమిశెట్టి లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం



గుంటక తిరుపతిరెడ్డి



శ్రీరాం సతీష్

వెలిగండ్ల(కనిగిరి రూరల్): జిల్లాలో వైఎస్సార్ సీపీ అభివృద్ధియే లక్ష్యంగా తాను పనిచేస్తామని.. మళ్లీ అధికారంలోకి రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఆదేశాను సారంగా పనిచేసి, జిల్లాలో పార్టీ పటిష్టతకు పనిచేస్తానన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా గుంటక తిరుపతిరెడ్డి నియామకంపై పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా..

కనిగిరిరూరల్: వైఎస్సార్ సీపీ పార్టీ బలోపేతానికి పూర్తిస్థాయిలో పని చేస్తానని మున్సిపల్ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ జిల్లా సెక్రటరీ యాక్టివిటీ శ్రీరాం సతీష్ అన్నారు. శ్రీరాం సతీష్ నియామకం పట్ల మున్సిపాలిటీలోని పలువురు కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, నాయకులు అభినందనలు తెలిపారు. తమపై నమ్మకంతో పదవులు ఇచ్చిన మాజీ సీఎం, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ ఒంగోలు పార్లమెంటరీ అధ్యక్షుడు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డికి, పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి విద్యార్థికి కళాశాల విద్య కీలకం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమణారెడ్డి



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

- ఘనంగా జూనియర్ కళాశాల వార్షికోత్సవం

కనిగిరిరూరల్: విద్యార్థి జీవితంలో కళాశాల విద్యే కీలకం అని.. క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రిన్సిపాల్ రమణారెడ్డి, ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల 56వ వార్షికోత్సవం, ద్వితీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు సభ కార్యక్రమం శనివారం జరిగింది. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రమణారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. చెడు వ్యసనాలు, స్నేహాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఎంఈఓల సంఘం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను, రాయితీలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు. విద్యతోనే బంగారు భవిష్యత్ లభిస్తోందని తెలిపారు. తొలుత ప్రిన్సిపాల్ రమణారెడ్డి సొంత నిధులు రూ.2 లక్షలతో నిర్మించిన కళాశాల ప్రాంగణాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వివిధ మండలాల కళాశాలల ప్రిన్సిపాల్‌లు రాజశేఖర్, జీ రాజేంద్ర బాబు, ఎంఈఓలు, హెచ్ఎంలు జీ సంజీవి, యువీ నారాయణరెడ్డి, శ్రీనివాసరావు, జేవీవీ నాయకులు గయాజ్, బాలు శ్రీనివాసులరెడ్డి, టంగుటూరి గోవిందరావు, అధ్యాపకులు ఖాశింపీరా, సీహెచ్ చెన్న కేశవులు, కే సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. వివిధ పోటీల్లోని విజేతలకు, గతేడాది అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి అభినాష్ రాజుకు, ప్రతి తరగతి గదిలో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులు అందజేశారు.

వివాహ వేడుకల్లో ఇన్‌చార్జి దద్దాల



వధూవరులను ఆశీర్వదిస్తున్న దద్దాల, నాయకులు

పీసీపల్లి: మండల పరిధిలోనే నేరేడుపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు గుజ్జుల బాల నరసారెడ్డి కుమారుడు గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణల వివాహ వేడుకలో పార్టీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దర్గా నారాయణ యాదవ్ పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, జెడ్పీటీసీ పెద్దిరెడ్డి ఓకే రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ పోలు జయరామిరెడ్డి, కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, రమణారెడ్డి, మార్తాల వెంకటేశ్వర రెడ్డి, శభరికంఠరెడ్డి, పులి వెంకటేశ్వర రెడ్డి, నరాల కొండారెడ్డి, ఏరువ నరసింహ చౌదరి, నరసింహ రెడ్డి, బోడే కొండారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి, ఎస్సీ నాయకులు కటికల వెంకటరత్నం, నాగిరెడ్డిపల్లి సర్పంచ్ సైకం స్వర్ణ ఏడుకొండలు రెడ్డి, ముక్కు వెంకటేశ్వర రెడ్డి, ఎర్రంరెడ్డి మోహన్‌రెడ్డి ప్రచార విభాగం అధ్యక్షుడు దాదిరెడ్డి మాలకొండారెడ్డి, లింగాలదిన్నె నరసింహారెడ్డి, స్టూడెంట్ విభాగం అధ్యక్షుడు సంగటి మహేంద్ర రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు రహీం, గొల్లపల్లి సర్పంచ్ నారాయణ రెడ్డి, మురిగింది సర్పంచ్ నల్లగంగుల శ్రీనివాస్, సంగటి కోటిరెడ్డి, బోడే కోటిరెడ్డి, బోడే శివ కోటి రెడ్డి, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూతపడిన వాటర్ ప్లాంట్



హనుమాన్‌నగర్‌లో మూతపడిన వాటర్ ప్లాంటు

సింగరాయకొండ: ప్రజలకు తాగునీరందించే వాటర్ ప్లాంట్ మూతపడటంతో దాహంతో అల్లాడుతున్నారు. మండల కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో పంచాయతీ ఆధ్వర్యంలో నడిచే వాటర్‌ప్లాంట్ సుమారు 6 నెలల నుంచి మూతపడినా పట్టించుకున్న నాథుడు లేడని కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ నిధులతో వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేశారు. తరువాత ఈ ప్లాంటు ప్రజలకు అందుబాటులో ఉండి దాహార్తిని తీరుస్తుంది. 20 లీటర్ల బబుల్ వాటర్ రూ.10 ఇచ్చేవారు. కాని ప్లాంటు మరమ్మతుల కారణంగా మూతపడటంతో అర కిలోమీటరు దూరంలోని ప్రైవేటు వాటర్ ప్లాంటు నుంచి మంచినీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఒక ప్రక్క జిల్లాస్థాయి సమీక్షలో కలెక్టర్ తమీమ్ అన్సారియా గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతుంటే ఇక్కడ మాత్రం పట్టనట్లు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మంచినీటి ఆటోల వద్ద 20 లీటర్ల క్యాన్ రూ.15 ఇచ్చి పట్టుకుంటున్నామని, అయితే ఆటోలు ఎప్పుడు వస్తాయో అర్థం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాంట్ మరమ్మతులకు నిధులు కేటాయించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రేపటి నుంచి లక్ష్మీగణపతి శిలావిగ్రహ ప్రతిష్ఠ



యాగశాల పనులను పర్యవేక్షిస్తున్న నాయకులు, కమిటీ



నూతనంగా నిర్మించిన మహాగణపతి ఆలయం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని అయ్యలూరివారి పల్లెలో నూతనంగా నిర్మించిన లక్ష్మీగణపతి ఆలయంలో గణపతి విగ్రహప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం 10వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈసందర్భంగా ఆలయంవద్ద యాగశాల నిర్మాణ పనులను ముమ్మరం చేశారు. 10న కార్యక్రమానికి అంకురార్పణ, గణపతిపూజ, పుణ్యాహవచనం, 11న నవగ్రహ హోమం, నూతన విగ్రహాల గ్రామోత్సవం, 12న విగ్రహ ప్రతిష్ఠ, ఉత్సవ మూర్తికి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈసందర్భంగా ఆలయ కమిటీ, వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ ముత్యాల నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజనా వెంకటరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు ముత్యాల వెంకట సుబ్బారెడ్డి, పలువురు కమిటీ సభ్యులు యాగశాల పనులను పర్యవేక్షించి ప్రతిష్ఠా మహోత్సవం భక్తులు పాల్గొనాలని కోరారు.